నేడు పోలవరంలో సీపీఐ బహిరంగ సభ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేనమేషాలు లెక్కించకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరతగితన పూర్తి చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పోలవరంలో భారీ బహిరంగ సభ జరగనున్నది. దీనికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ తదితరులు హాజరవుతున్నారని, ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని కావున అన్ని వర్గాల ప్రజలు ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు విజ్ఞప్తి చేశారు.

అన్ని వర్గాలకు సంక్షేమం

విశాలాంధ్ర-దేవరపల్లి: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దక్కుతుందని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్న మని జనార్దన్ రావు ఎంపీపీ కేవీకే దుర్గారావు జడ్పిటిసి పొట్టి స్వర్ణలత సర్పంచ్ అన్నపూర్ణ సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ అచ్యుత రావు దేవరపల్లి మండల బీసీ సెల్ మహిళా కన్వీనర్ కదలి హైమావతి మాజీ ఏఎంసీ చైర్మన్ ఎం రాజేంద్ర బాబు కుసులూరి వెంకట సతీష్ ఆచంట సురేష్ తాసిల్దార్ ఎం రామకృష్ కొండా వెంకటేశ్వరావ అధికారులు పాల్గొన్నారు

ట్రై సైకిల్ పంపిణీ

విశాలాంధ్ర-కొవ్వూరు: అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు సహాయం అందిస్తున్న వ్యవస్థాపకుడు డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర అభినందనీయుడని హోం మంత్రి తానేటి వనిత అన్నారు ఆదివారం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల నూతన వస్త్రాలు పండ్లు ఇతరత్రా వనిత అందజేశారు. ఈ సందర్భంగా అక్షయపాత్ర ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మంత్రి జన్మ దినోత్సవ సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పట్టణ ప్రముఖులు వైకాపా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో వలంటీర్లు చేస్తున్న ఇంటింటి సర్వేను రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్. మల్లి బాబు ఆదివారం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగింది. వాలంటీర్లు ఇంటింటి సర్వేలో ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు వారికి వివరించి ప్రతి ఒక్కరికి అవి చేరుకుంటున్నాయా లేదా, వారికి ఏమైనా సేవలు అవసరమయి ఉన్నావా అను విషయములు తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. కులధృవీకరణ పత్రంలు, ఆదాయ ధృవ పత్రములు, వివాహ ధ్రువపత్రములు, పెన్షన్, తదిదర సర్వీస్ లు అవసరమయిన యెడల వారి అభ్యర్ధన లు స్వీకరించి టోకెన్ నంబర్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. తదుపరి గ్రామ సభ జరిగే రోజున ప్రజలు/లబ్ధిదారులకు సదరు ధృవపత్రములు ఉచితముగా మంజూరు చేస్తామన్నారు. ఇంటింటి త్వరిత గతిన జవాబుదారితనంతో పూర్తి చేయాలని ఆదేశించారు.

చైతన్యయాత్ర విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని గోపాలపురం నియోజకవర్గ టీడీపి ఇంచార్జ్ మద్దిపాటి వెంకట రాజు పిలుపునిచ్చారు దేవర పల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 11 గంటలకు ద్వారకాతిరుమలలో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు అనంతరం జి కొత్తపల్లి లో మిల్క్ సీలింగ్ యూనిట్ని సందర్శించడం జరుగుతుందని తెలిపారు అలాగే జి కొత్తపల్లిలో వంద సంవత్సరాలు నుండి సాగు చేసుకున్న దళితుల భూములను ప్రభుత్వం తీసుకొందని అక్కడ సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు అనంతరం జి కొత్తపల్లి దూబచర్ల అధ్వానం ఉన్న రోడ్ను పరిశీలించడం జరుగుతుందని వెంకట్రావు తెలిపారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో దేవరపల్లి మండల టిడిపి అధ్యక్షుల ఆంద్రు అనిల్ గన్నమని హరికృష్ణ పెనుమత్స సుబ్బరాజు బిక్కిన నాగరాజు ముమ్మిడి సత్యనారాయణ, శ్రీలంకసత్యనారాయణ శ్రీనివాస్ కొట్టారు ధ్రువ కాంత నుదుట మాటి శ్రీనివాస్ కోయిలమూడి చందు పాల్గొన్నారు.

అనపర్తిలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర-అనపర్తి: అర్హులైన ఉండి ఏ ఒక్కరు సేవలు అందలేదని,లబ్ధి పొందలేదని చెప్పే అవకాశం ఉండకూడదనే ఉద్దేశంతో ప్రారంభించిన కార్యక్రమం జగనన్న సురక్ష.దీనిలో భాగంగా ఆదివారం అనపర్తి -1, మహేంద్రవాడ -1లో గ్రామ వాలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు.సర్వే సమయంలోనే సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులను స్కాన్ చేసి ఎప్పటికప్పుడు టోకెన్లు జెనరేట్ చేయగా మండల విస్తరణ అధికారి కె పద్మజ సురక్ష ఆన్లైన్ వర్క్ తనిఖీ చేశారని ఎంపిడిఓ హిమ మహేశ్వరి తెలిపారు.

ప్రతి దశలో రైతులకు ఇబ్బందులు

విశాలాంధ్ర-అనపర్తి: ఆకుమడి దగ్గర నుండి ధాన్యం విక్రయం వరకు రైతులు ప్రతి దశలోనూ ఇబ్బంది ఎదుర్కొంటున్నారని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నదురుబాద మైనర్ కాలువలో రామవరం-అర్తమూరు పరిధిలో సాగునీరు ప్రవాహాన్ని అడ్డుకున్న గుర్రపు డెక్క, తూడుకాడ రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ తాపేశ్వరం ఏఈ దృష్టికి సమస్య తీసుకెళ్లే ప్రయత్నం చేస్తే స్పందించలేదని ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఇ కి ఫోన్ చేస్తే స్పందించడం జరిగిందని అన్నారు. రైతులను ఆదుకోవాలనే ఆలోచన జగన్ మోహన్ రెడ్డికి లేదని వెంటనే స్పందించి కాలువలకి నీరు సమృద్ధిగా వదిలి పెట్టి, కాలువలు శుభ్రం చేయించి రైతులకు సకాలంలో నీరు అందించాలని నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండల తెలుగు రైతు కార్యదర్శి సత్తాలు, వీర భాస్కర్ రెడ్డి, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, బసివిరెడ్డి, సతీశ్వర రెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రలో భక్తులు

విశాలాంధ్ర-కపిలేశ్వరపురం: అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం రాజమహేంద్రవరంలోని ఇస్కాన్ ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం టేకి గ్రామంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంకీర్తనలను ఆలపిస్తూ భక్తులు యాత్రలో పాల్గొన్నారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా యాత్రను చేపట్టినట్టు గ్రామానికి చెందిన మేడిశెట్టి గోవిందరాజు తెలిపారు. కార్యక్రమంలో శ్యామంగ. శ్రీనివాసదాస్, ప్రభుజీ భక్తి బృందం, కత్తర్ నుండి రాధాపతి శ్యామదాసు, భక్తి బృందం దేవి దాన మాతాజీ భక్తీ బృందం టేకిగ్రామ భక్తి బృందం భక్తులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు దేవా మంగయమ్మ

విశాలాంధ్ర-రాజోలు: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకురాలు, మహిళా సమాఖ్య రాష్ట్ర నేత కామ్రేడ్ దేవా మంగయమ్మ ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం మలికిపురం మండలం దిండి గ్రామంలో కామ్రేడ్ దేవా మంగయమ్మ సంస్మరణ సభ సందర్భంగా మధుతో పాటు కాకినాడ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు తోకల ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు తదితర పార్టీ నాయకులు ఆమెకు నివాళులు అర్పించి, అనంతరం వారి కుమార్తె డాక్టర్ దేవా సుజాత, కోనసీమ పార్టీ జిల్లా నాయకులు దేవా రాజేంద్రప్రసాద్‌లను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ దేవా మంగయమ్మ జీవితకాలం ఆదర్శ కమ్యూనిస్టుగా పనిచేశారని ఆయన అన్నారు. ఆమె టీచరుగా ఉంటూ ఎస్‌టియు కీలక పాత్ర పోషిస్తూ అనేక ఉద్యమాలు చేపట్టారని అన్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య సమస్యలు జిల్లా అధ్యక్షురాలుగా ఉంటూ మహిళా సమస్యలపై పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు తోకల ప్రసాద్ మాట్లాడుతూ దేవా మంగయమ్మ భర్త దేవా ముసలయ్య రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీలో అగ్ర నాయకుడిగా పనిచేశారన్నారు. దేవా ముసలయ్య ఎప్పుడూ ఇంటి వద్ద లేకపోయినా ఆమె ఒకపక్క కుటుంబాన్ని మరోపక్క ఉద్యమాన్ని నడిపారని, ఆమె మరణం మహిళ లోకానికే తీరనిలోటు అని ఆయన అన్నారు. కాకినాడ జిల్లా కార్యదర్శి కె బోడకొండ మాట్లాడుతూ దేవా ముసలయ్య ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంలో కీలక పాత్ర పోషించారని, కాకినాడ రూరల్ కొవ్వూరు, పవర్, కైకవోలు తదితర ప్రాంతాలలో భూ పోరాటాలు నిర్వహించారని, ఆయనతోపాటు ఆమె ఉద్యమంలో భాగస్వాములు అయ్యారని ఆయన అన్నారు.

అమలాపురం: సీపీఐ నాయకుడు దేవా సురేష్ అధ్యక్షతన దిండిలో జరిగిన దేవా మంగాయమ్మ సంతాప సభలో సభ నుద్దేశించి సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడారు. తొలుత కామ్రేడ్ దేవా రాజేంద్ర ప్రసాద్ సీపీఐ జిల్లా నాయకులు సభను ప్రారంభించి తమ తల్లిదండ్రులు అయిన కామ్రేడ్ దేవా ముసలయ్య, మంగాయమ్మ వ్యక్తిత్వము, వారి ఉద్యమ నేపథ్యం వివరించారు. అనంతరం మంగాయమ్మ(80)చిత్ర పటానికి కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్, సిపిఐ, ఇతర ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పలువురు పుర ప్రముఖులు, పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సత్తిబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ నెకంటి సుబ్బారావు ప్రొఫెసర్ డాక్టర్ సదానందం దేవా రాధాకృష్ణ, కామ్రేడ్ పీతల రామచంద్రయ్య (సిపిఎం) కామ్రేడ్! కొండా దుర్గా రావు, కామ్రేడ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కాపు ద్రోహి ముద్రగడా! ముసుగు విడనాడు: త్సవటపల్లి

విశాలాంధ్ర-కాట్రేనికోన: కాపు నాయకుడు, మాజీమంత్రి ముద్రగడ పద్మ నాభం తన స్వార్ధ ప్రయోజనాల కోసం వైసిపి ముసుగులో ఉండి కాపుల ఐక్యతకు బంగం కలిగిస్తూ ఆ వర్గానికి తీరని ద్రోహం చేస్తున్నారని కాపు రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కన్వీనర్ త్సవటపల్లి నాగభూషణం ధ్వజ మెత్తారు. ఆదివారం మధ్యాహ్నం చెయ్యేరులో జరిగిన మండల కాపు నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కాపు ఉద్యమంలో బస్సులు పంపి ఆర్థికంగా సహకరించారంటూ ముద్రగడ కాపుల మనోభావాలు దెబ్బతీసేలా ఉత్తరాల రాసున్నారని, ఎవరో బిచ్చం వేస్తే తీసుకునే స్థాయికి కాపులు దిగజారలేదని నాగభూషణం తీవ్రంగా ఖండించారు. మొలతాడు కట్టుకోలేనివారు కూడా ఏవో మాట్లాడుతున్నారంటూ ముద్రగడ మూర్ఖత్వం మాటలను కాపు జాతి సహించదని, ఆరోజు తుని ఉద్యమంలో మొలతాడు ఉంది కాబట్టే పోలీసులను ఎదిరించి తన ఇంటిగేటు బయటకు తీసుకొచ్చామని గుర్తు చేశారు. కాపుల ప్రయోజనాలకు ఏనాడు సహకరించని ముద్రగడ ఇష్టమైన పార్టీకి వెళ్ళవచ్చు అని కులాన్ని తాకట్టు పెడితే ఊరుకునేది లేదని ద్వారంపూడి ఇచ్చిన ప్యాకేజీలకు అమ్ముడై, పవన్ కళ్యాణ్ పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మాజీ ఎంపీపీ ఆకాశం సత్యనారాయణమూర్తి, మాజీ సొసైటీ అధ్యక్షులు సలాది బాబ్జి, కాయల సూరిబాబు, గాలి దేవర గంగాధరరావు, మణికుమార్, తాడి సురేంద్ర బాబా, కొటికలపూడి శివ, కంచు స్తంభం సోని, నూకల దుర్గారావు నంద్యాల తాతాజీ, పోసంశెట్టి చంద్రావు గొల్లకోటి సాయిబాబా, బసవ లక్ష్మణ రావు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథలాన్ క్రీడలు

విశాలాంధ్ర-కాకినాడ: కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం నందు రాష్ట్రస్థాయి మోడరన్ పెంటాథలాన్ క్రీడలు విజయవంతంగా ముగిసాయని మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షులు డా చప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ క్రీడల్లో లేజర్ రన్ విభాగంలో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలోనూ, కాకినాడ జిల్లా రెండో స్థానంలోనూ, చిత్తూరు జిల్లా మూడో స్థానంలోనూ, అలాగే భయాథలాన్ విభాగంలో కాకినాడ జిల్లా మొదటి స్థానంలోనూ, విశాఖపట్నం జిల్లా రెండో స్థానంలో, చిత్తూరు జిల్లా మూడో స్థానంలో నిలిచాయి, ట్రైయాథలాన్ విభాగంలో విశాఖ జిల్లా మొదటి స్థానంలోనూ కాకినాడ జిల్లా రెండో స్థానంలోనూ చిత్తూరు జిల్లా మూడో స్థానంలోనూ నిలిచాయి. విజేతలుగా నిలిచిన టీం సభ్యులకు ముఖ్య అతిథులు డిఎస్‌డిఓ/చీఫ్ కోచ్ బి శ్రీనివాస్ కుమార్, మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షులు డా చప్పిడి వెంకటేశ్వరరావు, అలయన్స్ క్లబ్స్ వైస్ గవర్నర్ అలై వసుం శ్రీనివాసరావు చేతులమీదుగా ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా కోచ్ కట్టా జగన్మోహన్ కిశోర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వసుం ఉపేంద్రనాథ్, స్వాతి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు అలై కిరణ్ కుమార్, ఈవెంట్ ఆర్గనైజింగ్ సభ్యులు పైల అనంత కుమార్, వెలుగుబంట్ల వెంకటరమణ, డీఎస్ఏ స్టేడియం స్విమ్మింగ్ కోచ్ రాజా షేక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

విశాలాంధ్ర-గండేపల్లి: గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఐఇఇఇ వైజాగ్ బే సెక్షన్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న అడ్వాన్స్‌డ్ & గ్లోబల్ ఇంజనీరింగ్ ఛాలెంజెస్ (ఏజిఇసి)పై అంతర్జాతీయ సదస్సు ఫలప్రదంగా విజయవంతంగా ముగిసినట్లు ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల డైరెక్టర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సు ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా ఆంధ్రా ఎలక్ట్రికల్స్ సిఇఓ కె శ్రీధర్, పాల్గొని సదస్సులో ప్రధాన ప్రసంగం చేశారు. డీన్ డా కెవిఎస్ ఆర్ మూర్తి ఆర్గనైజింగ్‌లో రెండురోజుల సదస్సు విజ్ఞానదాయకంగా ముగిసింది. సదస్సులో పాల్గొన్న పరిశోధన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రొఫెసర్స్ ఆదిత్య ఆతిథ్యం మరువలేనిదని నిర్వహణ బాగుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి, డా డోలా సంజయ్ ఎస్ డా ఆదిరెడ్డి రమేష్, డీన్‌లు డా ఎస్ రమాశ్రీ, డా కెవిఎస్ఆర్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల నుంచి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారు: పవన్

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ : ఉమ్మడి తీర్పుగోదావరి జిల్లాలో ఈనెల 14వ తేదీన అన్నవరం నుండి ప్రారంభించిన అన్నవరం టు భీమవరం జనసేన వారాహి యాత్ర ఆదివారంతో ముగిసింది. ఆదివారం ఉదయం నుండి దిండి రిసార్టులో బస చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజోలు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, సమావేశంలో వారితో మాట్లాడి వారికి దిశా నిర్దేశం చేశారు. ఆదివారం సాయంత్రం వరకూ సాగిన చర్చాగోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గొడవలు సహజం..నేరపూరిత వ్యవస్థ ఉండకూడదు..పులివెందుల నుంచి వచ్చి పచ్చటి గోదావరి జిల్లాల్లో దౌర్జన్యం చేస్తున్నారు. మేము రాజోలు నుంచి అక్కడికి వెళ్లి జగన్‌కు సంస్కారం నేర్పిస్తాం. రాజోలు విజయం చీకట్లో చిరుదివ్వెలా మాకు ప్రేరణ ఇచ్చింది. రాజోలులో వెలిగించిన ఈ దీపం భవిష్యత్తులో రాజంపేట వరకూ వెలుగులు ప్రసరింప చేస్తుందన్నారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. క్రిమినల్ రాజకీయాలకు తాను వ్యతిరేకమన్నారు. పెద్ద మనుషుల ముసుగులో నేరాలు చేస్తూ పాలిస్తామంటే చికాకుగా ఉంటుందని చెప్పారు. రాజోలు విజయం తాలూకు వెలుగు ఏదో ఒక రోజు అఖండ జ్యోతిగా మారి రాష్ట్రం మొత్తం వెలుగులు ఇస్తుందని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు మార్పుకి సంకేతమని, ఈ ఎన్నికల్లో గెలిచేందుకు అధికారంలో ఉన్న వారు ఎన్ని అడ్డదారులు తొక్కాలో అన్నీ తొక్కుతారని చెప్పారు. దొంగ ఓట్లు వేస్తారు. ఉన్న ఓట్లు తీసేస్తారని, వీటన్నింటి మీద మనం పోరాటం చేయాలని సూచించారు. ఆదివారం మధ్యాహ్నం దిండి రిసార్ట్‌లో రాజోలు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఒక పార్టీ నిర్మాణం చాలా కష్ట సాధ్యమైన అంశం. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని వేలాది కోట్లు దోచేసి..అది కాస్త లక్ష కోట్లు దాటేసే పరిస్థితి. అలాంటి క్రిమినల్ రాజకీయాలు చేసే వ్యక్తులు, దౌర్జన్యాలు చేయగలిగే సమూహాలు ఉంటే విలువలు పాటించే వారు కూడా వారికి లొంగిపోతారు. ఇలాంటి వ్యవస్థల మధ్య రాజకీయ పార్టీ పెట్టడం చాలా సాహసోపేతమైన నిర్ణయం. పార్టీ పెట్టడానికి కుల బలమో, ఒక ప్రాంతం బలమో సరిపోదు. మనది ప్రజాస్వామ్యం కులస్వామ్యం కాదు. ఒక కులం ఆధారంగా రాజకీయం చేయలేము. కులాలను గుర్తించి, గౌరవించి అసమానతలు తగ్గించాలి. కుల ప్రాతిపదికన రాజకీయాలు చేస్తే అది వైసీపీ రాజకీయం అవుతుంది. అలాంటి రాజకీయాల వల్లే రాష్ట్రం అస్తవ్యస్తంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అన్ని కులాలు, మతాల సమూహం నుంచి విభిన్న కులాల వారితో పార్టీ స్థాపించాను. 150 మంది సభ్యులతో నాడు మొదలైన పార్టీ ఈ రోజున ఒక్క నియోజకవర్గంలోనే 10,214 మంది క్రియాశీలక సభ్యులు ఉన్న స్థితికి చేరింది. గెలుపుతో అది సాధ్యపడలేదు. గెలిచిన ఎమ్మెల్యే పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా బలమైన సమూహం మద్దతు తెలిపిందంటే భావ జాలం ప్రజల్లోకి బలంగా వేళ్లూనుకుంటుందని అర్ధం. గెలవకపోయినా పార్టీకి బలంగా మద్దతుదారులు పెరుగుతున్నారు. రాజోలు విజయం నాకు స్ఫూర్తినిచ్చింది. రాజకీయాల్లో వర్గాలు వర్గాలు సహజం. పార్టీలో వర్గాలు ఉన్నా అవి పార్టీని గెలిపించేవిగా ఉండాలి. రాపాక వరప్రసాద్ వెళ్లిపోయినప్పుడు పెద్దగా పట్టించుకోలేదు. మనం కోరుకున్న మార్పు ఎక్కడో ఒక చోట మొదలవ్వాలి. అది ఉభయ గోదావరి జిల్లాల్లోనే కావాలి. రాజోలు విజయం ప్రేరణ ఇచ్చింది. పచ్చటి ఉభయ గోదావరి జిల్లాలకు దిష్టితగిలింది. తాగడానికి నీరు లేదు. వాడుకకు నీరు లేదు. అక్వా కల్చర్‌తో డబ్బు వస్తోంది. దానితో పాటు కాలుష్యమూ వస్తోంది. ఇసుక దోపిడితో తీర ప్రాంతం మొత్తం నాశనం అయిపోతోంది. కాకినాడ నుంచి ఒక్కడు కూర్చుని గోదావరి జిల్లాలను శాసిస్తుంటే ఆశ్చర్యం వేసింది. ఇంత మంది పెద్దలు ఉండి ఒక్కరు ఎదురుతిరగకపోవడం బాధించింది. ఆ ఒక్కడికి పైన ఉన్న ఒక్కడి ఆశీర్వాదాలు ఉన్నాయి. రౌడీలు, కేడీలు సగటు మనిషిని బాధిస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు వేస్తా..మీకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా స్వయంగా నేనే వస్తా. ఉభయ గోదావరి జిల్లాలకు కూతవేటు దూరంలో అందుబాటులో ఉంటా. భీమవరం, రాజమండ్రిలో కార్యాలయాలు ఉన్నాయి. పిఠాపురం, అమలాపురంలో పెట్టబోతున్నాం. ఆంధ్రప్రదేశ్‌కి వైసీపీ నుంచి విముక్తి చేయాలంటే ముందు ఉభయ గోదావరి జిల్లాలను విముక్తం చేయాలి. అదే నా కోరిక. 34లో ఒక్క సీటు కూడా వైసీపీ గెలవ కూడదన్నారు. ఇక్కడ మహిళలకు రక్షణ లేదు. తీర ప్రాంతం మొత్తం దోపిడి చేసేస్తున్నారు. సీపీఎస్ రద్దు చేయలేదు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి మద్యం వ్యాపారం చేసుకుంటున్నారు. హత్యలు చేసేసి ఊరేగింపులు చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వేధిస్తున్నారు. దళితుల మీద కూడా అట్రాసిటీ కేసులు పెడతారు. చట్టాలను దుర్వినియోగం చేస్తుంటే కూర్చుని చూస్తూ ఉండాలా? మా హక్కులకు భంగం కలిగించినప్పుడు ఎదురు తిరిగి పోరాటం చేయాలి. రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరికీ ఉంటాయి. రాపాక వరప్రసాద్ సహా అంతా మీ ఓట్లతో గెలిచి గోదావరి దాటి అసెంబ్లీకి వెళ్లిపోయారు. కాకినాడలో పవన్ కళ్యాణ్‌ని కలిసిన మేధావులను స్థానిక ఎమ్మెల్యే ఇంటికి పిలిచి బెదిరించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వైసీపీ నాయకులు దొంగ ఓట్లు నమోదు చేస్తున్నారు. ఆ ధీమాతోనే ఎమ్మెల్యేల గెలుపు బాధ్యత నాదే అని ముఖ్యమంత్రి భరోసా ఇస్తున్నారు. రాజోలు జనసైనికులు, వీరమహిళలు చూపించిన తెగువా, రాజకీయ వ్యూహాలు రాష్ట్రంలోని ప్రతి జన సైనికుడు, వీర మహిళలకు స్ఫూర్తిదాయకం. వ్యక్తిగత స్వార్థం లేకుండా పనిచేసిన తీరు అందరికీ ఆదర్శవంతం. జనసైనికుల నిజాయతీ, పట్టుదల తట్టుకోలేక స్థానిక వైసీపీ నాయకులు కేసులు పెట్టడం, చిన్న చిన్న కాంట్రాక్టులు చేస్తే బిల్లులు నిలిపివేయడం చేస్తున్నారు" అని అన్నారు. సమావేశంలో పార్టీ నేతలు కందుల దుర్గేష్, పంతం నానాజీ, పితాని బాలకృష్ణ, చిలకం మధుసూదన్ రెడ్డి, అమ్మిశెట్టి వాసు, డి వరప్రసాద్, బొంతు రాజేశ్వర రావు, తాడి మోహన్, తదితరులు పాల్గొన్నారు

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

కరెంట్, మౌళిక వసతులు కోరుతూ ధర్నా

విశాలాంధ్ర-గొల్లప్రోలు: గత టీడీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో పేదలకు కేటాయించిన కాలనీలో మౌలిక సదుపాయాలు నేటికీ నోచుకోక ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం వన్నెపూడి గ్రామంలో గత టిడిపి ప్రభుత్వం హయాంలో దాదాపు 500మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి కొత్త కాలనీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కాలనీ ఏర్పడి దాదాపు నాలుగు వసంతాలు కావస్తున్న కరెంటు సదుపాయం లేక ఆదివారం సాయంత్రం వన్నెపూడి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019వ సంవత్సరం నుంచి తమ ఇళ్లకు పన్నులు కడుతున్నామని, కరెంటు సదుపాయం లేక తమ ఇళ్లలో నివసించడానికి నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గురించి పట్టించుకునే నాధుడే లేదని, అధికారులు ప్రజాప్రతినిధులు వస్తారు చూస్తారు వెళతారు తప్పితే, ఆచరణలో చూపించింది ఏమీ లేదంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటికైనా తమ కాలనీకు మౌలిక సదుపాయాలైన కరెంటు, త్రాగునీరు, సిసి రోడ్డు, డ్రైనేజీలు కల్పించాలని లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో రంగంలోకి దిగిన గ్రామ సర్పంచ్ ఎమ్మెల్యే సహా కారంతో తాత్కాలికంగా కరెంట్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఎస్ఐ వినయ్ ప్రతాప్ చర్యలు తీసుకోవడం జరిగింది.

మాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-ముమ్మిడివరం: ముమ్మిడివరం టీడీపీ పార్టీ కార్యాలయంలో మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మిమ్మితి చిరంజీవి అధ్యక్షతన ఎస్సీ సెల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసినరాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్ మాట్లాడుతూ మాలలు అందరు కలిసి ఈ నెల 27న మంగళగిరి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జరగబోయే మాలల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని మనకి రావలిసిన 24 పథకాలను తీసివేసిన ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గద్ది దింపి మాలల సత్త ఏమిటో చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొద్దుకు నారాయణరావు (బాలు) గొల్లపల్లి గోపీ, దొమ్మేటి రమణకుమార్, మెండి కమల, దాసరి నాగేశ్వరావు, కాశిమూర్తి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పశువుల రవాణా చేస్తున్న వాహనాలు సీజ్

విశాలాంధ్ర-ఏలేశ్వరం: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఏలేశ్వరం ఎస్ఐ జి సతీష్ తెలిపారు. గ్రామ శివారు వాహనాలు తనిఖీ చేస్తుండగా జడ్డంగి వైపు నుంచి రెండు బొలెరో వాహనాల్లో పశువులను అక్రమంగా కళేబరాలకు తరలిస్తుండగా వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఏపీ 39 యుఎఫ్ 0010 గల వాహనంలో 5పశువులు, రెండవ వాహనము ఏపీ 39 యూకే 2251 నెంబర్ గల వాహనాల్లో 7 పశువులు అక్రమంగా బంధించి తాళ్లతో కట్టి నీరు గాని, గడ్డి గాని, ఎటువంటి సదుపాయాలు కల్పించకుండా, పశువులను తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకోని, వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పశువులను సంరక్షణ నిమిత్తం గోశాలకు తరలించటం జరిగిందన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారానికి శ్రీకారం

విశాలాంధ్ర-రాజానగరం: దశాబ్దాలు తరబడి పేద ప్రజల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న సురక్షతో శ్రీకారం చుట్టామని తూర్పు గోదావరి జిల్లా వైసీపీ అధ్యక్షులు, నియోజవర్గ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాధేయపాలెం గ్రామంలో జడ్పిటిసి సభ్యులు వాసంశెట్టి పెద్ద వెంకన్న ఆధ్వర్యంలో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో రెండు రోజైన ఆదివారం గ్రామ వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా విధానాలను వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు ఏర్పాటుతో ప్రజల చెంతకు సేవలు వెళ్తున్నయని చెప్పారు.